సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 20 । ఆగస్టు । 2024




## తనిఖీలు చేపట్టాలి

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఫిర్యాదుదారుల సందడి లేదు.

- 8లో ▸



## క్రాప్‌లోన్ రెన్యువల్‌లో తిరకాసు

వృద్ధులకు సంబంధించిన పంట రుణాలను రెన్యువల్ చేయడానికి బ్యాంకర్లు ఆసక్తి చూపడం లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.0 /22.6

## వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

# మాకెందుకు మాఫీ చేయరు?

- పంట రుణం మాఫీ కాని రైతుల్లో ఆందోళన
- అర్హత ఉన్నా లబ్ధి చేకూరలేదని ఆవేదన
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- సర్కారు తీరుపై ఆగ్రహంతో నిరసన బాట

**పంట రుణాల మాఫీతో రుణ విముక్తులమవుతామని భావించిన అన్నదాతల ఆశలు** నెరవేరలేదు. జిల్లాలో వేలాదిమంది రైతుల అప్పులు అలాగే ఉండిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమ క్రాప్‌లోన్ ఎందుకు మాఫీ కాలేదో తెలుసుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సర్కారు తీరుపై ఆగ్రహంతో ఆందోళనలకూ దిగుతున్నారు. అర్హులందరి పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : 'లోన్ మాఫీ అవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నం. మాతో కలిసి బేంకులోను తీసుకున్నోళ్లకు మాఫీ అయ్యింది. మాకెందుకు కాలేదు. మేమేం పాపం జేసినం' అని పంట రుణం మాఫీ కాని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరు రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో 1.70 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల ద్వారా రూ.1,458 కోట్ల మేర పంట రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు మూడు విడతల్లో పంట రుణాలను మాఫీ చేసింది. జిల్లాలో మూడు విడతల్లో కలిపి 91,899 మంది రైతులకు సంబంధించిన రూ.655.37 కోట్ల రుణమే మాఫీ అయ్యింది. రూ. 2 లక్షలలోపు రుణాలు తీసుకున్న వేలాది మంది రైతులకు పథకం వర్తించలేదని తెలుస్తోంది. తమ లోన్ ఎందుకు మాఫీ కాలేదో తెలుసుకోవడానికి నిత్యం అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఆధార్ కార్డులో ఉన్న పేరు, బ్యాంకు రుణఖాతాలో ఉన్న పేరులో అక్షరాలు తేడాగా ఉండడం, రేషన్ కార్డు ప్రామాణికం అంటూ కొందరిని తప్పించడం.. ఇలా రకరకాల కారణాలతో వేలాది మంది రైతులు అవకాశం కోల్పోయారని అధికారులు సమాధానం చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాటపడుతున్నారు. సదాశివనగర్ మండలం వజ్జెపల్లి తండాలో రైతులు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పిట్లం మండలం రాంపూర్(కలాన్)లో సోమవారం రైతులు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. తాడ్వాయి మండలంలోనూ రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రైతులందరి రుణాలను మాఫీ చేయకపోతే ఆందోళనలకు దిగుతామని ప్రతిపక్షాల నాయకులు హెచ్చరిస్తున్నారు. రుణమాఫీ కాని రైతులను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. రుణాల మాఫీ విషయంలో సర్కారు సరైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రాంపూర్ గ్రామీణ బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

### గ్రామీణ బ్యాంకు వద్ద నిరసన

పిట్లం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. రాంపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్ద సోమవారం రైతుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. కొంతమందికి తీసుకున్న రుణానికి మాఫీ అయిన మొత్తానికి పొంతనే లేదని పేర్కొన్నారు. ఇష్టారాజ్యంగా రుణాలను మాఫీ చేశారని విమర్శించారు. బ్యాంకులు, సహకార సంఘాలు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతులందరి పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

**జిల్లాలో విడతల వారీగా రుణమాఫీ వివరాలు.. (రూ. కోట్లల్లో)**

| విడత | రైతులు | మాఫీ |
|---|---|---|
| మొదటి | 49,540 | 231.13 |
| రెండో | 24,816 | 211.72 |
| మూడో | 17,543 | 212.52 |
| మొత్తం | 91,899 | 655.37 |

### గ్రీవెన్స్ సెల్‌కు..

రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతులతో పాటు ఇతర కారణాలతో మాఫీ ఆగిపోయిన రైతులు వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 6,654 మంది రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలోని గ్రీవెన్స్ సెల్‌ను సంప్రదించారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. వచ్చిన రైతుల ఆధార్ నంబర్ల ఆధారంగా చెక్ చేసి వారికి ఎందుకు మాఫీ కాలేదన్న విషయాన్ని వివరిస్తున్నామన్నారు. ఇదే సమయంలో మండలాల్లో రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక్కో మండలానికి ఒక్కో అధికారిని ఇన్‌చార్జీగా నియమించారని పేర్కొన్నారు.

### రుణం మాఫీ కాలే..



నా పేరు మీద రూ.2 లక్షలు, నా భార్య పేరు మీద రూ.లక్షల క్రాప్‌లోన్ ఉంది. రేషన్ కార్డు ఒక్కటే ఉండడం వల్ల మాఫీ కాలేదని ఆఫీసర్లు అంటున్నరు. భార్యాభర్తలకు ఒకటి కాకుంటే రెండు రేషన్ కార్డులుంటయా? ఇచ్చిన మాట ప్రకారం కుటుంబానికి రూ. 2 లక్షలు మాఫీ చేయాలి.

– గంగాధర రాజయ్య, రైతు, బందరామేశ్వర్‌పల్లి

### రికార్డులో లేదంటున్నరు



2023 జూలైలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి రూ.40 వేలు పంట రుణం తీసుకున్న. రుణం మాఫీ కాలేదు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే సైట్‌లో వివరాలు లేవంటున్నారు. బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకువస్తే పరిశీలిస్తామంటున్నరు. నాకు అన్యాయం జరిగింది.

– కావటి చిన్న బాలయ్య, గాంధారి

### ఇంటిపేరులో పొరపాటుతో..



నాకు రాజంపేట ఎస్‌బీఐలో రూ.1.70 లక్షల లోన్ ఉంది. పట్టా పాసుబుక్కులో కుమ్మరి శ్రీనివాస్ అని పేరుండడంతో అదే పేరుతో బ్యాంకులో లోన్ ఇచ్చారు. ఆధార్ కార్డులో ఇంటి పేరు రాగిచెట్టు శ్రీనివాస్ అని ఉంది. దీంతో నాకు రుణమాఫీ కాలేదు. న్యాయం చేయాలి.

– కుమ్మరి శ్రీనివాస్, రాజంపేట

### పేరు వేరుగా ఉండడంతో..



మాకు వెల్లుట్లపేటలో మూడున్నర ఎకరాల భూమి ఉంది. మహ్మద్‌నగర్ యూనియన్ బ్యాంకులో రూ.1.60 లక్షల అప్పు తీసుకున్నం. పాస్ బుక్కులో కొట్లాట రాజవ్వ అని, బ్యాంకు, ఆధార్ కార్డులలో కొట్టాల రాజమణి అని ఉంది. పేరు, అక్షరాలు వేరుగా ఉన్నాయని మాఫీ చేయలేదు.

– కొట్టాల రాజమణి, వెల్లుట్లపేట

### ఎందుకు మాఫీ కాలేదో చెప్త లేరు



నాకు వెల్లుట్లపేటలో రెండున్నర ఎకరాల పొలం ఉంది. మహ్మద్‌నగర్ యూనియన్ బ్యాంకులో రూ. 1.20 లక్షల లోన్ తీసుకున్నాను. ఇంత వరకు మాఫీ కాలేదు. అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. ఎందుకు మాఫీ కాలేదో తెలియడం లేదు.

– కొట్టాల మణెవ్వ, వెల్లుట్లపేట

## న్యూస్‌రీల్

### బడులకు బదులు సంఘం భవనాలకు నిధులా?

- ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి తీరుపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం



కామారెడ్డి టౌన్: శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయించాల్సింది పోయి పీఆర్టీయూ భవనాలకు కేటాయించడం శోచనీయమని ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్, కోశాధికారి సంగయ్య, టీపీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజం తదితరులు సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. భిక్కనూరు, ఎల్లారెడ్డి, కామారెడ్డిలలో పీఆర్టీయూ భవనాల నిర్మాణానికి రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ప్రకటించడాన్ని తప్పుపట్టారు. ప్రభుత్వ నిధులను ఒక యూనియన్ భవన నిర్మాణాలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఆ నిధులను సర్కా రు బడులకు కేటాయించాలని డిమాండ్ చే శారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

### నిజాంసాగర్‌లోకి 1,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సోమవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటి పారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)కుగాను సోమవారం సాయంత్రానికి 1,390.50 అడుగుల(4.251 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

**ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద**

బాల్కొండ : నిజామాబాద్ జిల్లా బాల్కొండలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 11,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 (80 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1,081.80 (50 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

### నేడు కామారెడ్డి బంద్

కామారెడ్డి టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం కామారెడ్డి బంద్‌కు పిలుపునిచ్చినట్లు కామారెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంచర్ల లింగం, ప్రధాన కార్యదర్శి సుకుమార్‌గౌడ్ తెలిపారు. విద్య, వాణిజ్య, వ్యాపార సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

### రుణమాఫీ కాలేదని సొసైటీకి తాళం



నిజామాబాద్ రూరల్ : రుణమాఫీ కాలేదని రైతులు సోమవారం పాల్దా సొసైటీ గేటుకు తాళం వేశారు. సొసైటీ పరిధిలో 138 మంది రైతులకు రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. తాము మాఫీకి అర్హులమైనా జాబితాలో పేర్లు రాలేవని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ చైర్మన్ కొలాస్ శ్రీనివాస్ రైతుల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

### పేకాట స్థావరంపై దాడి

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలోని పేకాట స్థావరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేసి 35 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఓ బాంకెట్ హాల్‌లో పేకాడుతున్నారన్నా సమాచారం మేరకు పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. 35 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ. 2.38 లక్షలు, 228 కాయిన్స్, 35 సెల్‌ఫోన్‌లు, నాలుగు కార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతున్న వారిని మెట్‌పల్లి, మంచిర్యాల, బాన్సువాడ, బోధన్ తదితర ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

## ఘనంగా రాఖీ పండుగ



జిల్లాకేంద్రంలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

**జిల్లాలో సోమవారం రాఖీ పండుగను** ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్నాతమ్ముళ్లకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టారు. సోదరులు కట్నకానుకలు అందించి, ఆశీర్వాదాలు తీసుకున్నారు.

- కామారెడ్డి టౌన్

# పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించండి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్‌లు, ఉప తహసీల్దార్‌లు

కామారెడ్డి క్రైం: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓటర్ జాబితా నవీకరణపై తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేపటి నుంచి ఓటరు జాబితా నవీకరణ(సవరణ) ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. జాబితాలో పేర్లున్నవారు శాశ్వతంగా ఎక్కడికైనా వెళ్లిపోయారా, చనిపోయారా, పేర్లలో తప్పులు ఉన్నాయా అనే అంశాలను బీఎల్వోలు తెలుసుకోవాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండేవారినుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అక్టోబర్ 10 వరకు ఇంటింటా సర్వే పూర్తిచేయాలన్నారు. సర్వే చేసిన ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించాలన్నారు. ఓటర్ జాబితా ముసాయిదాను అక్టోబర్ 29న ప్రకటించనున్నట్లు తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో 1,500 మందికంటే ఎక్కువ మంది ఓటర్లుంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఒక కుటుంబం మొత్తం ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని సూచించారు. మృతిచెందిన ఓటర్ల పేర్లను తొలగించడానికి వారి కుటుంబ సభ్యులకు నోటీస్ అందజేయాలని తెలిపారు. డెత్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ తీసుకొని పేరును తొలగించాలన్నారు. బుధవారం మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. వీఐపీ ఓటర్లు జాబితా నుంచి తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, మాజీ ప్రజాప్రతినిధుల పేర్లు ఓటరు జాబితాలలో గల్లంతు కాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ఇందూరులో దంచికొట్టిన వాన

- నగరంలో జలమయమైన రోడ్లు
- రైల్వే కమాన్ వద్ద వరదనీటిలో చిక్కుకున్న బస్సు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం వాన దంచికొట్టింది. కుండపోతగా వర్షం కురవడంతో రహదారులు జలమయం అయ్యాయి. నిజామాబాద్ నగరంలో ఏకదాటిగా గంటపాటు కురిసిన వర్షంతో కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. వర్షంతో నగరంలో రైల్వే కమాన్ వద్దనున్న రైల్వే అండర్ బ్రిడ్జి కిందకు భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఈ నీటిలో ఓ బస్సు చిక్కుకుపోయింది. దీంతో ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్ వచ్చే వాహనాలను అధికారులు నిలిపివేశారు. మున్సిపల్, పోలీస్ అధికారులు గంట పాటు శ్రమించి బస్సులోని ప్రయాణికులను బయటకు తీసుకువచ్చారు. అనంతరం బస్సును పొక్లెయిన్ సాయంతో బయటకు తీశారు. మున్సిపల్ కమిషనర్ మకరంద్, పోలీసులు అక్కడే ఉండి వర్షపు నీటిని పూర్తిగా తొలగింపజేశారు. బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా అందులో 10 మంది వరకు పిల్లలున్నారు. అందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చామని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు.





నగరంలోని రైల్వేకమాన్ వద్ద వరద నీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సులోంచి ప్రయాణికులను తీసుకువస్తున్న మున్సిపల్ సిబ్బంది, పోలీసులు



కామారెడ్డి బస్టాండ్‌నుంచి బయలుదేరుతున్న బస్సులో ప్రయాణికుల రద్దీ

# ఆర్టీసీకి 'పండుగ'

- కిక్కిరిసిన బస్సులు
- ఇబ్బందిపడ్డ ప్రయాణికులు



కిటకిటలాడుతున్న కామారెడ్డి బస్టాండ్

కామారెడ్డి టౌన్: ఆర్టీసీకి రక్షాబంధన్ మరింత కళ తెచ్చింది. ప్రయాణికుల రద్దీతో బస్టాండ్లు, బస్సులు కళకళలాడాయి. ఇప్పటికే మహాలక్ష్మి పథకంతో నిండుగా ఉంటున్న బస్సులు.. పండుగ నేపథ్యంలో మరింత కిటకిటలాడాయి. రద్దీతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. కొన్ని రూట్లలో బస్సులలో నిల్చోవడానికి కూడా స్థలం ఉండడం లేదు. రెండు రోజులుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సోమవారం రాఖీ పౌర్ణమి నేపథ్యంలో మరింత రద్దీ కనిపించింది. రెండు రోజులలో సాధారణ రోజులకన్నా 40 శాతానికిపైగా అదనపు ఆదాయం వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## క్లుప్తంగా

### సౌత్‌క్యాంపస్‌లో వృక్షాబంధన్



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో వృక్షాబంధన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అధ్యాపకుడు డాక్టర్ నారాయణ ఆధ్వర్యంలో సౌత్‌క్యాంపస్‌లోని మొక్కలు, చెట్లకు రాఖీలు కట్టి కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. సౌత్‌క్యాంపస్‌లో ప్రతి మొక్కను కాపాడటంతో పాటు నూతనంగా మొక్కలను నాటి సౌత్‌క్యాంపస్‌ను మరింత ఆహ్లాదకరంగా తయారు చేసేందుకు ఈకార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యాపకుడు నారాయణ తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అధ్యాపకులు ప్రతిజ్ఞ, అంజయ్య, మోహన్‌బాబు, యాలాద్రి, ఈకో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### మైనారిటీ బాలుర వసతి గృహం తనిఖీ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మైనారిటీ బాలుర విద్యార్థి వసతి గృహాన్ని సోమవారం మైనారిటీ సంక్షేమ జిల్లా ఇన్‌చార్జి అధికారి దయానంద్ తనిఖీ చేశారు. వసతి గృహంలో నిత్యావసర వస్తువులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేసి ప్రతిరోజు ఆహారం ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన రుచికరమైన వంటలు చేయాలని సిబ్బందికి సూచించారు.

### రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణ



నిజాంసాగర్(జుక్కల్): అర్హత ఉండి సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయ శాఖ అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయ అధికారి అమర్‌ప్రసాద్ దరఖాస్తులను స్వీకరించారు. మూడు విడతల్లో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడంతో వివిధ కారణాల వల్ల రుణమాఫీ కాని రైతులు వ్యవసాయశాఖ కార్యాలయానికి తరలి వస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే రైతుల ఆధార్ నంబర్లను సరిచేసి రుణమాఫీ వచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారి అమర్‌ప్రసాద్ తెలిపారు.

# రెన్యువల్‌లో తిరకాసు

- వృద్ధాప్యాన్ని సాకుగా చూపుతూ వంట రుణాలు రెన్యువల్ చేయని వైనం
- 70 ఏళ్ల వయస్సు వచ్చే వరకు రుణాలు ఇవ్వొచ్చని గతంలోనే నిర్ణయం

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన కొమ్ముల గంగు అనే మహిళా రైతుకు మూడు ఎకరాల భూమి ఉంది. ఆమెకు రూ.1.80లక్షల రుణం మాఫీ అయ్యింది. కొత్తగా పంట రుణం కోసం తమ గ్రామంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దరఖాస్తు చేసుకుంది. అయితే, ఆమెకు 62 ఏళ్ల వయస్సు ఉన్న కారణంగా పంట రుణం ఇవ్వలేమని బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. రుణం మాఫీకాగా తాను బ్యాంకుకు ఎలాంటి బకాయి లేనని కొత్తగా రుణం ఇవ్వడానికి ఎందుకు తిరకాసు పెడుతున్నారని ఆ మహిళా రైతు సదరు బ్యాంకు అధికారులను ప్రశ్నిస్తే వృద్ధాప్యాన్ని సాకుగా చూపుతున్నారు.

ఇది ఒక్క గంగుకు ఎదురైన సమస్య కాదు. పంట రుణం మాఫీకి అర్హత సాధించిన ఎంతో మంది వృద్ధ రైతులు ఎదుర్కొంటున్నది. 70 ఏళ్ల వయస్సు వచ్చే వరకు రైతులకు పంట రుణాలను ఇవ్వొచ్చని గతంలోనే నిర్ణయించారు. ఇప్పటికే



కొన్ని బ్యాంకుల్లో వృద్ధ రైతులకు పంట రుణాలను రెన్యువల్ చేస్తున్నారు. అనేక చోట్ల వృద్ధులైన రైతులకు పంట రుణాలను రెన్యువల్ చేయడం కాని మాఫీ పొందిన వారికి కొత్త రుణం ఇవ్వడం కానీ చేయడం లేదు. వ్యవసాయం చేసే సత్తా ఉన్నా వయస్సును కారణంగా చూపుతూ తమకు రుణం ఇవ్వకపోవడం సరికాదని వృద్ధ రైతులు వాపోతున్నారు. ఆరోగ్యం సహకరించడంతో తాము సొంతంగానే పొలం పనులు చేసుకుంటున్నామని ఇలా రుణాలు ఇవ్వకుండా మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా లీడ్ బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి పంట రుణాల విషయంలో వృద్ధాప్యాన్ని సాకుగా చూపకుండా వెసులుబాటు కల్పించేలా చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### రుణం ఇవ్వకపోతే ఎలా..



వ్యవసాయం చేస్తున్న ప్రతి ఒక్క రైతుకూ అవసరం ఉంటే పంట రుణం ఇవ్వాలి.ఆరోగ్యం సహకరిస్తుండడంతో వయస్సు మీద పడినా ఎంతో మంది చక్కగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. కేవలం వృద్ధాప్యాన్ని సాకుగా చూపడం సరికాదు. బ్యాంకర్లు తమ తీరు మార్చుకోవాలి. – కొలిప్యాక ఉపేంద్ర, మాజీ ఎంపీపీ, ఏర్గట్ల

### ప్రభుత్వ ఆశయాన్ని దెబ్బతీయొద్దు



పంటరుణం మాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సానుకూలంగా వ్యవహరించింది. ఇప్పుడు పంట రుణం మాఫీ అయిన వృద్ధులకు ఎందుకు కొత్తగా రుణం ఇవ్వకుండా సతాయిస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. రైతులను ఇబ్బందులకు గురిచేసి ప్రభుత్వ ఆశయాన్ని దెబ్బతీయడం బ్యాంకర్లకు తగదు.

– కుంట రవిశంకర్, రైతు, పాలెం

## దేశం, ధర్మ పరిరక్షణే రక్షాబంధన్ సందేశం

సుభాష్‌నగర్: దేశం, ధర్మ పరిరక్షణ బాధ్యతను మనకి గుర్తుచేసే పండగే రక్షాబంధన్ అని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు విభాగ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ కంఠేశ్వర్, నాందేవ్‌వాడ ఉపనగరాల రక్షాబంధన్ కార్యక్రమానికి ఆయన ప్రధానవక్తగా హాజరై మాట్లాడారు. మన సంస్కృతి మీద దాడులు జరిగిన ప్రతిసారి భారతీయులు.. ముఖ్యంగా హిందువులు ధర్మరక్షణ కోసం కంకణధారులై దేశాన్ని ధర్మాన్ని కాపాడారని, సంస్కృతిని పరిరక్షించిన వీరుల వారసులే హిందువులనే విషయాన్ని మనం ప్రతిరోజూ గుర్తు చేసుకోవాలన్నారు. హిందూ సమాజంలో అంటరానితనం, కుల బేధాలు క్యాన్సర్ కన్నా ప్రమాదమని, వాటిని ఆచరించేవాళ్లు అసలు మనుషులే కాదన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ రాపెల్లి రవీందర్ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ వంటి ఒక మహోన్నతమైన సంస్థ వేదిక మీదకి తనను ఆహ్వానించడం



భగవా ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్

ఆనందంగా ఉందన్నారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యవాహ అరుగుల సత్యం, సహ కార్యవాహలు సుమిత్, వెంకటేశ్, జిల్లా, విభాగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మద్నూర్(జుక్కల్): బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌డీసీసీ బ్యాంక్ మేనేజర్ సాయిలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎన్‌డీసీసీ బ్యాంక్‌లో సోమవారం ఆ యన మాట్లాడారు. రైతులకు, విద్యార్థులకు అతి త క్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని అన్నారు. కర్షక్ మిత్ర పథకంలో ఒక ఎకరం వ్యవసాయ భూమికి గతంలో రూ.1.50 లక్షల రుణం ఇచ్చేవారమని, ప్రస్తుతం రూ.50 వేలు పెంచి రూ.2 లక్షల్ని 11.5 శాతం వడ్డీతో అందిస్తున్నామన్నారు. గోల్డ్‌లోన్‌లో కేవలం రూ.79 పైసలతో రూ.20 లక్షల వరకు రుణం అందిస్తామన్నారు. హౌసింగ్‌లోన్ 12 శాతం వడ్డీతో రూ.30 లక్షల వరకు రుణం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది గంగా కిషోర్, శేఖర్ ఉన్నారు.

## న్యాయవాదులపై దాడులు సరికాదు





జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

ఖలీల్‌వాడి: రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై పోలీసుల భౌతికదాడులు సరికాదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ అన్నారు. జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు సంతోష్‌ను అకారణంగా ఇంటి నుంచి తీసుకువెళ్లిన తీరు సభ్యసమాజానికి తలవంపులు తెచ్చిందన్నారు. పోలీసులు చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడడం క్షమించరాని క్రిమినల్ చర్య అని పేర్కొన్నారు. బోరబండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జమాల్‌ను ఉద్యోగం నుంచి తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై పోలీసు దాడులపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం త్వరితగతిన రూపొందించి అమలు చేయాలని కోరారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎం రాజేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, కోశాధికారి దీపక్, లైబ్రరీ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, న్యాయవాదులు మాణిక్‌రాజు, రవీందర్, భిక్షపతి, బిట్ల రవి, ఆశ నారాయణ, విశ్వక్ సేన్‌రాజ్, భానుచందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలి

### కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని వసతిగృహాల్లో మండల ప్రత్యేక అధికారులు తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదులను స్వీకరించారు. రాఖీ పండుగ ఉండడంతో ప్రజావాణికి జనం తక్కువగా వచ్చారు. వచ్చిన కొద్దిమంది నుంచి కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారం చూపారు. అనంతరం ఆయాశాఖల అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి వసతి గృహాల్లో పరిసరాలు శుభ్రంగా ఉండేలా, పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను శాఖల వారీగా అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. డీఆర్‌డీవో సురేందర్,



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

డీపీవో శ్రీనివాసరావు, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**తాడ్వాయిలో ప్రజావాణికి ఫిర్యాదులు నిల్**

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ సరళ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఏవో నర్సింలు పాల్గొన్నారు.

## తాత్సారమెందుకో?

- జీజీహెచ్‌లో ముగిసిన డైట్ టెండర్
- ఓపెన్ కాని టెండర్లు



నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డైట్ టెండర్ల ప్రక్రియ ముగిసినా టెండర్లను ఓపెన్‌చేయడం లేదు. అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదని టెండర్లలో పాల్గొన్న వారు అంటున్నారు. ఇన్‌పేషెంట్, డ్యూటీ డాక్టర్స్, థెరపెటిక్ పేషెంట్‌లకు అవసరమైన భోజన వసతి కల్పించేందుకు జూలై 11న డైట్ సప్లై టెండర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ విడుదల చేశారు. జూలై 12 నుంచి 16వరకు టెండర్లను స్వీకరించిన సంబంధిత అధికారులు గడువు తేదీని మరో నాలుగు రోజులు పొడిగించారు. టెండర్లలో పాల్గొన్న 12 మంది రూ.3లక్షల చొప్పున డీడీ తీసి టెండర్‌ఫారాలకు జత చేశారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తరువాత 20వ తేదీన టెండర్లను అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లో ఓపెన్‌చేయాల్సి ఉండగా ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తికాలేదు. దీంతో టెండర్లు దాఖలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. తాము రూ.3లక్షల బయట వడ్డీకి తీసుకువచ్చి టెండర్లు వేశామని, ఇప్పటికీ టెండర్లు ఓపెన్ చేయకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా బదిలీల ప్రక్రియ కారణంగా టెండర్లు ఓపెన్ చేయడం ఆలస్యమైందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

**కలెక్టర్‌కు ఫిర్యాదు**

జీజీహెచ్‌లో గత 14 సంవత్సరాలుగా ఒకే వ్యక్తి డైట్ కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్నాడని ఈ నెల 12న జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో మహ్మద్ ఇజ్యాన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అధికారులను మచ్చిక చేసుకొని టెండర్ జరగకుండా చూస్తున్నారన్నారు. సదరు వ్యక్తి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, వరంగల్, ఆర్మూర్, బాన్సువాడ, ఎల్లారెడ్డి తదితర ఆస్పత్రుల్లో పదికి పైగా డైట్ టెండర్‌లు చేజిక్కించుకొని అంతా తానై నడిపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే టెండర్లను ఓపెన్ చేసి పారదర్శకంగా కొత్తవారికి కేటాయించాలని కోరారు.

### కలెక్టర్ వద్ద ఫైల్ ఉంది

టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించాం. మొత్తం 12మంది టెండర్లలో పాల్గొన్నారు. కలెక్టర్ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉంది. జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు టెండర్ ఓపెన్ చేయడం జరుగుతుంది.

– ప్రతిమారాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్

## 'డబుల్' ఇళ్ల కబ్జాకు యత్నం

రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను కబ్జా చేసేందుకు స్థానికులు సోమవారం యత్నించారు. కొందరు ఇళ్ల తమ ఆధార్ కార్డుల జిరాక్స్‌లు అతికించగా, మరికొందరు కొత్తగా తలుపులు బిగించి తాళం వేశారు. వంద ఇళ్లను నిమిషాల వ్యవధిలోనే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ వెంకటేశం, సీఐ జయేశ్‌రెడ్డి, వర్ని ఎస్సై కృష్ణకుమార్, ఏఎస్సై రాజు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇళ్లను ఖాళీ చేయాలని సూచించడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయిన తరువాత కేటాయిస్తామని అధికారులు సముదాయించినా వారు వినలేదు. గతంలో పంపిణీ చేసిన 50 ఇళ్లలో అనర్హులు ఉన్నారని, ఇప్పుడు కూడా తమకు ఇళ్లు ఇస్తారనే నమ్మకం లేక వచ్చామన్నారు. తలుపులు ఏర్పాటు చేయడంతోపాటు మిగతా పనులు తామే పూర్తి చేసుకుంటామని మొండికేశారు. దీంతో గం



ఇళ్లు ఖాళీ చేయాలని సముదాయిస్తున్న పోలీసులు

దరగోళ పరిస్థితి నెలకొంది. మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి.. అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయిస్తామని భరోసా కల్పించారు. గతంలో తయారు చేసిన జాబితాలో పేర్లు లేనివారు తహసీల్ కార్యాలయంలో పేర్లు ఇవ్వాలని సూచించారు. దీంతో పలువురు కబ్జా చేసిన ఇళ్లను ఖాళీ చేసి తహసీల్ కార్యాలయానికి తరలివెళ్లారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తరువాత సమగ్ర సర్వే చేసి అర్హులైన వారికి పంపిణీ చేస్తామని తహసీల్దార్ వెంటేశం వెల్లడించారు.

### చేపల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని ఎస్సీ లబ్ధిదారుల నుంచి చేపల పెంపకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో గోపాల్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పీఎం అజయ్ పథకం కింద ఈ నెల 21న మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి దరకాస్తులు తీసుకుంటామన్నారు. ఈ పథకానికి ఎస్సీలు మాత్రమే అర్హులు.

### ఇసుక వేలం పాట

బిచ్కుంద(జుక్కల్): హజ్గుల్ శివారులో ఆదివారం అక్రమంగా వేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం ఇసుక వేల పాట నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సురేష్ తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.



## క్రైం కార్నర్

# పరిస్థితి విషమించి ఇద్దరి మృతి

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చిత్తరి సావిత్రి (30) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఎస్సై సందీప్ తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా సావిత్రి ఈ నెల 12న రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**హాజీపూర్ తండాకు చెందిన మహిళ..**

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హాజీపూర్ తండాకు చెందిన కాట్రోత్ కేస్లీబాయి(55) సోమవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కడుపునొప్పితో బాధపడిన కేస్లీబాయికి వైద్యులు ఆపరేషన్ చేశారని, ఆమె కోలుకోకపోగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో కుటుంబీకులు, తండావాసులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. కేస్లీబాయి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపించారు. కేస్లీబాయి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

**రైలు పట్టాలు దాటుతూ..**



ఖలీల్‌వాడి: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మార్కెట్‌యార్డు పక్కన సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను(87126 58591, 94934 51642) సంప్రదించాలని ఆయన సూచించారు.

### ఒకరి బైండోవర్



మాచారెడ్డి: మద్యం సేవించి తరచుగా డయల్ 100కి కాల్ చేసి సమయాన్ని దుర్వినియోగం చేసిన ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ఎరిగె చందు అనే వ్యక్తిని తహసీల్ కార్యాలయంలో సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. అవసరం లేకున్నా డయల్ 100కు, 108కు ఫోన్ చేసి సమయాన్ని వృథా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఈ నంబర్లను అత్యవసర సేవలకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.

### పేకాటస్థావరంపై దాడి

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం గుండూర్‌లో పేకాట స్థావరంపై సోమవారం రాత్రి ఎస్సై భువనేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని రూ.10 వేల 900 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పేకాట స్థావరాలు ఎక్కడైనా కొనసాగితే తమకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు.

### మనోవేదనకు గురై ఆత్మహత్య



ఆరేపల్లి లత(ఫైల్)

బాల్కొండ: అప్పులు ఎక్కువయ్యాయనే మనోవేదనతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మెండోరా మండలం వెల్కటూర్‌లో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన భూమేశ్వర్ ఉపాధి నిమిత్తం గత పదేళ్లుగా బహ్రెయిన్‌కు వెళ్తూ వస్తున్నాడు. ఆయన భార్య లత ఇద్దరు పిల్లలతో కలిసి గ్రామంలోనే ఉంటోంది. ఇటీవల నూతన ఇంటిని నిర్మించుకోగా అప్పులు అయ్యాయి. ఇదే సమయంలో భర్తకు బహ్రెయిన్‌లో పని సరిగా లేకపోవడంతో అప్పులు తీర్చడం ఎలా అని లత మనోవేదనకు గురైంది. సోమవారం ఉదయం కొడుకును టీవీ చూస్తూ ఉండమని చెప్పి బెడ్‌రూంలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. తల్లి తలుపులు తీయకపోవడంతో ఆమె కుమారుడు పక్కింటి వారికి విషయం తెలిపాడు. వారు వచ్చి తలుపులు పగులగొట్టగా లత అప్పటికే చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి కొత్తపల్లి బుచ్చన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త బహ్రెయిన్ నుంచి మంగళవారం రానున్నట్లు స్థానికులు తెలిపారు.

### బైక్‌ల చోరీ కేసులో ఇద్దరి రిమాండ్



లింగంపేట(ఎల్లారెడ్డి): బైక్‌ల చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గాంధారి ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. కేసులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. గాంధారి మండలం గుడిమెట్, మాధవపల్లి, తిమ్మాపూర్ ప్రాంతాల నుంచి బైక్‌లు ఎత్తుకెళ్లిన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం కల్లూరుకు చెందిన బీర్కూరు లింగంను అరెస్ట్ చేశామన్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా బాన్సువాడ నుంచి గాంధారివైపు అనుమానాస్పదంగా వస్తున్న లింగను అదుపులోకి తీసుకొని విచారించగా.. తన బంధువైన కల్లూరుకు చెందిన సోలాపూర్ రాజుతో కలిసి బైక్‌లు చోరీ చేసినట్లు నేరం ఒప్పుకున్నాడన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

### టీషర్ట్ బుక్ చేస్తే పాత చున్నీ డెలివరీ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన మీ సేవ నిర్వాహకుడు సునీల్ వారం రోజుల క్రితం అమెజాన్‌లో టీ షర్ట్, ప్యాంట్ బుక్ చేయగా పార్సిల్‌లో పాత చున్నీ వచ్చింది. సోమవారం రోజున వచ్చిన పార్సిల్‌ను తెరిచి చూసిన సునీల్ అవాక్కయ్యాడు. డెలివరీ బాయ్‌ని ఇదేమిటని ప్రశ్నిస్తే రిటర్న్ పెట్టాలని సూచించాడన్నారు. గతంలో కూడా పలుమార్లు ఒకటి ఆర్డర్ చేస్తే మరొకటి వచ్చిందని, ఆర్డర్ చేయకున్నా ఒకసారి తన పేరుపై పార్సిల్ వచ్చిందని సునీల్ వాపోయాడు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

బాన్సువాడ రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని యజమానులపై కేసు నమోదు చేసినట్లు బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపారు. ఈనెల 18న రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గైనిశంకర్ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారని, అలాగే 19వ తేదీన మధ్యాహ్నం బదావత్ దస్రూ అనే కానిస్టేబుల్ బస్‌డిపో మరో ట్రాక్టర్‌ను స్వాధీనంచేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

## తండ్రిని చంపిన తనయుడికి జీవిత ఖైదు

రుద్రూర్: తండ్రి హత్య కేసులో తనయుడికి న్యాయస్థానం జీవితఖైదు విధించింది. రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చిక్కడపల్లికి చెందిన నక్క సాయిలు అలియాస్ ఛత్రపతి 11 నవంబర్ 2023న రాత్రి రుద్రూర్ జవహర్‌నగర్ కాలనీలో ఉంటున్న తన తండ్రి నక్క చిన్నపోశెట్టి వద్దకు వచ్చి భూమి విషయమై తగాద పడి హత్య చేసి పారిపోయాడు. రెండు రోజుల తరువాత ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో సమీపంలో ఉన్న వారు పోలీసులకు సమాచారం అందించారు. అదే రోజు నక్క సాయిలు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు. సాక్షుల విచారణ అనంతరం సాయిలుపై నేరం రుజువుకావడంతో నేరస్తుడికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఐదో జిల్లా ఆదనపు న్యాయమూర్తి (బోధన్ సెషన్స్ కోర్టు జడ్జి) ఎస్ రవికుమార్ సోమవారం తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు.

**అన్నను హత్య చేసిన తమ్ముడికి..**

రెంజల్(బోధన్): అన్న హత్య కేసులో మండలంలోని నీలా గ్రామానికి చెందిన ఖలీం ఖురేషికి జీవిత ఖైదు విధిస్తూ బోధన్ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎస్ రవికుమార్ సోమవారం తీర్పు వెలువరించారు. మద్యానికి బానిసైన మహ్మద్ ఖలీం ఖురేషి తరచు తల్లితో గొడవ పడుతుండడంతో ఆయన అన్నయ్య బాబా ఇరువురిని సముదాయించే ప్రయత్నం చేశాడు. 2019 జులై 14న తల్లితోపాటు సోదరుడితో మాట్లాడుతుండగా.. కోపోద్రిక్తుడైన ఖలీం ఖురేషి ఇంట్లో నుంచి కత్తి తీసుకువచ్చి బాబాపై దాడి చేశాడు. స్థానికులు అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఖలీం ఖురేషిని రిమాండ్‌కు తరలించారు. సోమవారం వాదనలు విన్న న్యాయమూర్తి నేరం రుజువుకావడంతో ఖలీం ఖురేషికి జీవిత ఖైదుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

## సూపర్ మార్కెట్‌లో చోరీ

- రూ.15 లక్షల నగదు అపహరణ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లి కాలనీ పెడగాపల్లి చౌరస్తాలో ఉన్న అన్నపూర్ణ సూపర్ మార్కెట్‌లో దుండగులు చోరీకి పాల్పడి రూ.15లక్షల నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం సూపర్ మార్కెట్ తెరిచేందుకు వెళ్లిన యజమాని తాళాలు తెరిచి లోనికి వెళ్లగా కౌంటర్ తెరిచి ఉంది. దుండగులు పైకప్పు రేకులను కట్ చేసి లోనికిదిగి చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పట్టణ సీఐ వీరయ్య విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. ఆదివారం రాత్రి దుకాణాన్ని



వివరాలను సేకరిస్తున్న పట్టణ సీఐ వీరయ్య

మూసి ఇంటికి వెళ్లాలనని, వరుసగా నాలుగైదు రోజులు బ్యాంకులకు సెలవులు రావడంతో రూ.15లక్షల నగదును కౌంటర్‌లోనే ఉంచి వెళ్లానని సూపర్ మార్కెట్ యజమాని సుధీర్ తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.